నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 31 డిసెంబర్ 2023 | JOGULAMBA GADWAL WANAPARTHY

కల్వకోల్‌లో మాట్లాడుతున్నమ ంత్రిజూప ల్లి కృష్ణారావు

ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక

కొల్లాపూర్, డిసెంబర్ 30 : సమస్యల పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే సామాన్యులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను హెచ్చరించారు. శనివారం కొల్లాపూర్‌లోని ఆరో వార్డు కౌన్సిలర్ రమణ సమక్షంలో ప్రజాపాలన నిర్వహించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. తనకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే లంచం డిమాండ్ చేశారని, ఇప్పటికే కొన్ని డబ్బులు కూడా ముట్టజెప్పానని ఓ మహిళ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి ఆధారాలు సమరిస్తే విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. అలాగే సిలిండర్లు, భూమార్పిడి కోసం డబ్బులు వసూలు చేస్తున్నారని మంత్రికి చెప్పగా.. గ్యాస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తాసీల్దార్ శ్రీకాంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతో నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన ఉంటుందన్నారు. అభయహస్తం దరఖాస్తుల కోసం ఎవరైనా డబ్బుల వసూలుకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని దళారులను హెచ్చరించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీలో జనవరి 15వ తేదీ వరకు ప్రజల ఇండ్లల్లో సిలిండర్ ఉండాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో ఎవరికీ టికెట్ ఇవ్వబోమని కాంగ్రెస్ కౌన్సిలర్లకు, ఆశావహులకు సూచించారు. అంతకు ముందు మంత్రి జూపల్లిని మున్సిపల్ కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ రమ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో నాగరాజు, ఎంపీపీ భోజ్యానాయక్, కౌన్సిలర్లు శ్రీదేవిగౌతంగౌడ్, నరసింహారావు, నహీం, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి..

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారెంటీలకు దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మండలంలోని దేవునితిరుమలాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం గ్యారెంటీలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం కల్వకోల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ గౌడ్, జెడ్పీటీసీ గౌరమ్మ, సర్పంచులు సత్యం, వెంకటేశ్వర్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ నరసింహ, సీపీఐ జిల్లా నాయకులు యేసయ్య పాల్గొన్నారు.

జిల్లెడదిన్నెలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అన్నివిధాలా అండగా ఉంటా..

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

వడ్డేపల్లి, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన వారితో ఆరు గ్యారెంటీలు మీకు వచ్చేందుకు అన్ని విధాలా కృషిచేస్తామని, అందరికీ అండగా ఉంటానని, రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. మండలంలోని జిల్లెడదిన్నెలో శనివారం నిర్వహించిన ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అలాగే జూలేకల్‌లో 491, రేషన్ కార్డుల కోసం 194, జిల్లెడుదిన్నెలో 224, రేషన్‌కార్డుల కోసం 91దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి ఎంపీడీవో రవీంద్ర, తాసీల్దార్ జ్యోతి స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముషాయిదా బేగం, సర్పంచులు కళావతి, శారద, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ అయిన బండలాగుడు పోటీ నిర్వహణ స్థలం

నిలిచిన బండలాగుడు పోటీలు

- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్పీ
- అధికారులఆ దేశాలతో వెనక్కి తగ్గిన హస్తం నాయకులు

గద్వాల అర్బన్, డిసెంబర్ 30 : మల్దకల్ మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ హస్తం నాయకులు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ పోటీలు రెండు ప్రధాన పార్టీల నాయకులు నిర్వహించేందుకు సిద్ధంకాగా పోలీసుల అవగాహనతో ఒక వర్గం వెనక్కి తగ్గిన విషయం విదితమే. తమ పార్టే అధికారంలో ఉందని.. పోలీస్ అధికారుల ఆదేశాలు తమకేమీ పట్టనట్లు హస్తం నాయకులు బండలాగుడు పోటీలను నిర్వహించారు. దీంతో పోలీసులు హస్తం నాయకులతోపాటు నిర్వాహకులు, ఎద్దుల యాజమానులపై నిబంధనల ఉల్లంఘన, జంతు హింస కేసులు నమోదు చేశారు. అయినా తాము వెనక్కి తగ్గమంటూ శనివారం కూడా పోటీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో హస్తం నాయకులు పోలీసుల నిబంధనలను పట్టించుకోవడం లేదంటూ రెండు రోజులుగా సామజిక మాధ్యమాలతో పాటు పత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా పోలీస్ బాస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోటీలను ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం బండలాగుడు పోటీలు జరగకుండా తగిన చర్యలు చేపట్టారు. అధికారుల ఆదేశాలు పాటించకుండా పోటీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో హస్తం నాయకులు వెనక్కి తగ్గి పోటీ ప్రదేశం నుంచి వెళ్లిపోయారు.

ఆదేశాలు పాటించాలి : డీఎస్పీ వెంకటేశ్వర్లు

అధికారులు ఆదేశాలను అతిక్రమించి పోటీలు నిర్వహించడం చట్టప్రకారం నేరం. లా అండ్ ఆర్డర్‌ను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించకుండా నిలిపివేశాం. జిల్లాలో ఎక్కడైనా బండలాగుడు పోటీలు నిర్వహిస్తూ జంతువులను హింసిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

కాపుకాసి హతమార్చారు..

- హత్యకు దారితీసిన పొలం బాట గొడవ
- కత్తులు, గొడ్డళ్లతో దాయాదుల దాడి

చిక్కలపల్లి మల్లేశ్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 30 : పొలంలో బాట విషయంపై ఏర్పడిన కక్ష సాధింపు చర్యలకు ఒక నిండు ప్రాణం బలైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి, నారాయణపల్లి గ్రామాల మధ్య ఈ దారుణ హత్య శుక్రవారం రాత్రి జరిగింది. గంట్రావుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్ చిక్కలపల్లి మల్లేశ్ (38)కు వారి దాయదుల మధ్య పొలంలో బాట విషయంపై ఎన్నికల ముందు గొడవలు జరిగాయి. ఎన్నికల తర్వాత మాట్లాడుకుందామని గ్రామంలో పెద్ద మనుషులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అయితే ప్రత్యర్థులు పగ పెంచుకొని సమయం కోసం కాపు కాసి మల్లేశ్ రోజువారీ కార్యక్రమాలపై రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి సాతాపూర్ గ్రామానికి వెళ్లి మల్లేశ్ చిట్టి డబ్బులు వసూలు చేసుకుని బైక్ పై గ్రామానికి వెళ్తుండగా, గంట్రావుపల్లి స్టేజీ సమీపంలో దాయాదులు అడ్డగించారు. కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి, గొడ్డలితో గొంతునరికి దారుణంగా హతమార్చారు. ఈ హత్య సంఘటన గురించి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి కొల్లాపూర్ సీఐ యాలాది ఎస్సై రాజు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాలాది తెలిపారు.

- రాఘవేంద్రరావు, చిరంజీవి, ప్రముఖుల ప్రశంసలు
- సినిమా ఫొటోగ్రఫీ నుంచి సినీ ప్రయాణం
- పంచతంత్ర కథలతో దర్శకరంగేట్రం
- రెండో ప్రయత్నంగా 'సర్కారు నౌకరి'..
- వెండితెరపై కొల్లాపూర్, కృష్ణమ్మ అందాలు
- సినీరంగంలో ఎదుగుతున్న గంగనమోని శేఖర్

వెల్గొండ టు వెండితెర

సినీ దర్శకుడిగా పాలమూరు యువకుడు

'కలలు కనండి.. సాధించండి'.. అనేది దివంగత రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం మాటలు. ఆ మాటలను అచ్చం పుణికిపుచ్చుకున్నాడో పాలమూరు పల్లెకు చెందిన గంగనమోని శేఖర్. కష్టాలు అందరికీ ఉంటాయి.. కానీ ఆ కష్టాలను ఇష్టాలుగా మలుచుకొని సినీరంగంలో ఎదగాలనే తన ఆకాంక్షకు పట్టుదలను జోడించి అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ స్థాయి నుంచి దర్శకత్వ స్థాయికి ఎదిగి జిల్లా ప్రతిభను చాటుతున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్గొండకు చెందిన శేఖర్ 'సర్కార్ నౌకరి' చిత్రానికి దర్శకత్వం వహిస్తూ ప్రముఖ హీరో చిరంజీవి, దర్శకుడు కే.రాఘవేంద్రరావుతో పాటుగా పలు సినీ దిగ్గజాల ప్రశంసలను పొందుతున్నారు. ఇక అదే వెండి తెరలో పాలమూరు అందాలను ప్రపంచం ముందుకు తీసుకొస్తున్న శేఖర్ సినీ ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

- నాగర్‌కర్నూల్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)

కష్టాన్ని ఇష్టపడితే ఏదైనా సాధించొచ్చు
గంగనమోని శేఖర్, దర్శకుడు

మాది చిన్న వ్యవసాయ కుటుంబం. సినిమా ఇండస్ట్రీలో దర్శకత్వం నా కల. దాన్ని సాధించడానికి జేఎన్‌టీయూలో ఫొటోగ్రఫీ అభ్యసించి ఒక్కో మెట్టు ఎక్కుతూ కష్టపడ్డా. పంచతంత్ర కథలుతో వచ్చిన గుర్తింపుతో రాఘవేంద్రరావు స్టోరీ లైన్ విన్నవెంటనే సర్కారు నౌకరి సినిమాకు అవకాశం కల్పించారు. చిరంజీవిలాంటి ఎందరో ప్రముఖులు ట్రైలర్‌ను చూసి ప్రశంసించారు. గాయని సునీత కొడుకును వెండితెరకు పరిచయం చేయడం చాలా సంతోషంగా ఉన్నది. చిన్నప్పుడు ఊరిలో ఎన్నో కష్టాలు ఉండేవి. ఏడాదంతా వ్యవసాయం చేస్తే పట్టుమని పదివేలు వచ్చేవి కావు. ఇప్పుడు ప్రాజెక్టులతో నీళ్లు వచ్చి మంచిగా వ్యవసాయం జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కొల్లాపూర్, నల్లమల అడవి సినిమా షూటింగ్‌లకు ఎంతో అనువైన ప్రాంతం. సింగోటం, నాయినోనిపల్లి, సోమశిల, మొలచింతలపల్లి రోడ్లు అద్భుతంగా ఉంటాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇతర ఉద్యోగాల గురించి యువత ఆలోచించాల్సిన పరిస్థితులు ఉండవు. ఔటింగ్‌కు వెళ్లాలంటే అరకు ప్రాంతం ఎక్కువగా విన్నాం. కానీ ఈ ప్రాంతంలో ఎక్కువగా అలాంటి వాతావరణం ఉన్నది. సర్కారు నౌకరీ సినిమాలో కూడా సోమశిల వద్ద కృష్ణానది, ఘాట్లు, సోమశిల ఆలయం, కొల్లాపూర్ ప్రాంతాలను ఈ సినిమాలో చూపించడం జరిగింది. తగిన వనరులు కల్పిస్తే కొల్లాపూర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఇప్పుడు కొల్లాపూర్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా ఉన్నది. సర్కారు నౌకరి తర్వాత ప్రస్తుతం తమిళంతో పాటుగా రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. టాలెంట్ ఉంటే సినీ ఇండస్ట్రీలో రాణించవచ్చు. దర్శకత్వ ధీరుడు రాఘవేంద్రరావు వద్ద పని చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. నా భవిష్యత్తుకు ఈ సినిమా, రాఘవేంద్రరావు సహకారం చాలా ఉపయోగపడుతుంది.

నాడు పాలమూరు ప్రజలు, ముఖ్యంగా యువత అంటే పొట్టకూటి కోసం వలస వెళ్లే కూలీలుగా పేరుండేది. తెలంగాణ రాష్ట్ర సాధనతో ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగయ్యాయి. రాష్ట్రంలో శివారున నల్లమల ప్రాంతంలోని యువత క్రీడా, సాంస్కృతిక, సాహిత్య, ఇతర రంగాల్లో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తూ పాలమూరు ఖ్యాతిని చాటుతున్నారు. ఇదే క్రమంలో సినీ రంగంలోనూ ఇప్పటికే పలువురు తమదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఇదే కోవలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గం వెల్గొండకు చెందిన గంగనమోని శేఖర్ తన సినీ ప్రయాణాన్ని అద్భుతంగా ముందుకు సాగిస్తున్నారు. బిజినేపల్లి మండలం వెల్గొండలో చిన్న రైతులైన చంద్రయ్య, చంద్రమ్మ ఐదుగురి సంతానంలో శేఖర్ ఒకరు. సొంతూరులో 2004 వరకు పదో తరగతి, 2004-2006 నుంచి ఇంటర్ నాగర్‌కర్నూల్‌లో చదివారు. శేఖర్‌కు సినిమాలో పేరు తెచ్చుకోవాలన్న ఆసక్తి.. కష్టపడేతత్వం తప్పా ఇండస్ట్రీపై అవగాహన లేదు. పూర్తిగా కొత్త. పాలమూరు నుంచి వచ్చిన వాళ్లంటే సినీ ఇండస్ట్రీలో మరింత చిన్నచూపు. అలాంటి తరుణంలో శేఖర్ తన ప్రతిభను నమ్ముకొన్నారు. అతడి సోదరుడు గురుమూర్తి సహకారంతో జేఎన్‌టీయూలో బీఎఫ్ఏ ఫొటోగ్రఫీలో చేరి ఫోటోగ్రఫీపై పట్టుసాధించారు. సినిమాటోగ్రాఫర్ అధ్యక్షుడిగా, ఇప్పటికే సినీరంగంలో మంచి పేరు తెచ్చుకొన్న బిజినేపల్లి మండలం పాలెంకు చెందిన పీజీ విందాతో ఫొటోగ్రఫీ గురించి మరింత అవగాహన తెచ్చుకొన్నారు. ఈ క్రమంలో పలు రాష్ట్రస్థాయి అవార్డులను సాధించారు. ఇలా రాజేంద్రప్రసాద్ నటించిన 'అయ్యారే' సినిమాకు సర్వేశ్ మురారీ దగ్గర తొలిసారిగా అసిస్టెంట్‌గా, అప్రెంటీస్‌లో చేరారు. తర్వాత ఆపరేటింగ్ కెమెరామెన్‌గా చేశారు. ఇలా రగడ, నిప్పు, యాక్షన్ త్రీడీ, దూసుకెళ్తా, పటాస్, షేర్, దేశంలో దొంగలు పడ్డారుతోపాటు తమిళ పటాస్‌లాంటి 12 చిత్రాలకు అసోసియేట్ కెమెరామెన్‌గా పని చేశారు. కాగా నాట్యం సినిమాకు చేయడంతో మరింత గుర్తింపు లభించింది. అదే విధంగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ దగ్గర అసిస్టెంట్‌గా మూడేళ్లు పని చేశారు.

దర్శకత్వమే లక్ష్యంగా..

సినిమా రంగంలో అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేస్తూ మరింత స్థాయికి ఎదగాలనే ఆకాంక్ష రోజూ తొలచివేసేది. తనకు తొలుత రచనపై ఆసక్తి. ఆ తర్వాత తుది లక్ష్యం దర్శకత్వం. ఇలా అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్‌గా చేస్తూ సినిమా ఇండస్ట్రీలో ఇలా నిలదొక్కుకున్నాక దర్శకత్వం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకొన్నారు. దీంతో కెమెరామెన్ జీవితమే తన గమ్యమా.. అని ఓసారి ఆలోచించుకొంటూ రాగా లాక్‌డౌన్ తన లక్ష్యం దిశగా సాగే పరిస్థితులు కల్పించింది. కెమెరా పట్టిన చేతులతో 24 క్రాఫ్ట్‌లను పర్యవేక్షించే కీలకమైన దర్శకత్వంవైపు మళ్లారు. అప్పటికే దర్శకుడి ఆలోచనలను తన కెమెరాతో ప్రతిబింబించిన ఆయన 2002లో 'పంచతంత్ర' కథలు సినిమాకు తొలిసారిగా దర్శకత్వం వహించారు. ఈ సినిమా సినీ విమర్శకులతో పాటుగా ప్రేక్షకుల నుంచీ మంచి ప్రశంసలు పొందింది. తొలి ప్రయత్నంలోనే శేఖర్‌కు దర్శకుడిగా మంచి ఆరంభం లభించింది. ఇది చూసిన దర్శక దగ్గజులు కే.రాఘవేంద్రరావు ఎవరు.. ఈ సినిమా తీశారని ఆరా తీశారు. దీంతో శేఖర్‌కు వెండితెరలో తొలి ప్రశంసలు, గుర్తింపు దక్కినట్లైంది.

ఆకట్టుకుంటున్న సర్కారు నౌకరి ట్రైలర్

స్వయంగా దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు పిలిపించి మెచ్చుకోవడంతో పాటు ఆర్.కే టెలీషో ద్వారా రెండో సినిమాకు 'సర్కారు నౌకరి'కి అవకాశం ఇచ్చారు. మెగాస్టార్ చిరంజీవి ట్రైలర్‌ను రిలీజ్ చేస్తూ శేఖర్ దర్శకత్వ ప్రతిభను మెచ్చుకొన్నారు. ట్రైలర్ ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ సినిమా ద్వారా ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్‌ను వెండితెరకు పరిచయం చేశారు. 2024 జనవరి 1న ఈ సినిమా విడుదల కానున్నది. 1996లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా స్వయంగా చిన్నప్పుడు చూసిన అనుభవాలతో ఈ సినిమా తీశారు. ఆ కాలంలో ప్రస్తుతం కరోనా మాదిరి మహమ్మారిలో ప్రభావం చూపిన ఎయిడ్స్ అంశాన్ని ఇతివృత్తంగా ఎంచుకోవడం విశేషం. ఓ యువతికి సర్కారు నౌకరి చేసుకునే యువకుడు భర్తగా వస్తాడని భావిస్తుంటే.. పెళ్లి తర్వాత ఎయిడ్స్‌ను అరికట్టేందుకు నిరోధ్‌లు అమ్మే ఉద్యోగి తన భర్త కావడంతో ఆ కుటుంబంలో, సమాజంలో జరిగే అంశాలు ఏ విధంగా ప్రభావం చూపాయనే వాటిపై చక్కగా చిత్రీకరించారు. పలు సీన్లను కొల్లాపూర్ ప్రాంతంలోనే తీయడం విశేషం. తొలి సినిమా 'పంచతంత్ర కథలు'లో రెండు ఎపిసోడ్లను సైతం ఇక్కడే తీశారు. కొల్లాపూర్, సోమశిల, సింగోటం వద్ద షూటింగ్ చేశారు. శేఖర్ అమ్మమ్మ ఊరు మొలచింతలపల్లి కావడంతో కొల్లాపూర్‌లో సినిమాలు తీసేందుకు ఉన్న పరిస్థితులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నది. ఓ రోజంతా అమరగిరిలోనే షూటింగ్ నిర్వహించారు. ఇక్కడి నల్లమల అడవులు, కృష్ణా నది పరీవాహక ప్రాంతం, నీళ్లు సినిమా తీయడానికి ఎంతో అనువైన ప్రదేశాలుగా చిన్నప్పటి నుంచి శేఖర్‌కు అనుభవం. ఇలా సినిమాలు తీయడంతో నల్లమల శోభ ప్రపంచానికి చాటుతున్నారు. షూటింగ్‌లు ఇక్కడ జరిగితే స్థానికులకూ కొంత ఉపాధి కల్పించినట్లవుతుందన్నది ఆయన ఆలోచన. వాటర్ బాటిళ్లు, కూరగాయలు, హోటళ్లు, వాహనాలు, పెట్రోల్, డీజిల్‌లాంటి వాటికి రూ.2.50 కోట్లను ఈ ప్రాంతంలో సినిమా ద్వారా ఖర్చు చేశారు. ఇది తమ ప్రాంత ప్రజలకు అందించినట్లవుతుందన్నది శేఖర్ భావన. ఎత్తంలో షూటింగ్‌ను చూసిన దర్శకుడు రాఘవేంద్రరావు ఈ ప్రాంతం బాగుందని, ఓసారి తాను కూడా వచ్చి చూస్తానని వచ్చారు. ఆ సమయంలో స్కూల్ పిల్లలకు చెప్పులు లేనిది గమనించిన వితరణ చేశారు. ఇలా తన ప్రమేయం లేకుండా, తెలియకుండా కూడా కొందరికి ఈ మాధ్యమం ద్వారా ప్రజలకు సాయం చేశాననే మంచితనం శేఖర్‌లో కనిపిస్తోంది. మొత్తం మీద నల్లమలలోని వెల్గొండ అనే చిన్న గ్రామం నుంచి వెండితెరను ఏలే లక్ష్యంతో ముందుకు సాగుతున్న గంగనమోని శేఖర్‌ను పాలమూరు ప్రజలు ముఖ్యంగా యువత మెచ్చుకొంటున్నారు.

- పీఎస్ఎస్ఎం ఫౌండర్ పరిమళ పత్రీ
- కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం

ధ్యానంతో మానసిక ప్రశాంతత

కడ్తాల్, డిసెంబర్ 30 : నిత్య ధ్యాన సాధనతో జ్ఞానం, మానసిక ప్రశాంతత లభిస్తుందని.. మహేశ్వర మహా పిరమిడ్ పత్రీజీ శక్తిస్థల్ ప్రపంచ ధ్యాన ప్రధాన కార్యాలయంగా విరాజిల్లుతుందని పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రీ అన్నారు. కైలాసాపురిలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పత్రీజీ ధ్యాన మహాయాగాలు శనివారం పదోరోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల ధ్యానంలో ఆధ్యాత్మిక గురువులు, ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిమళ పత్రీ మాట్లాడుతూ ధ్యానంతో ఒత్తిడి తగ్గిపోయి మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మనలో మనం కలిసిపోవడమే ధ్యానమని, ధ్యానంతో అపారమైన జ్ఞానం, ఆనందమయ జీవితం పొందొచ్చని పేర్కొన్నారు. ధ్యాన సాధనతోపాటు సత్యాలు మాట్లాడితేనే జీవితం సాఫీగా సాగుతుందని తెలిపారు. 2024లో నిర్వహించే ధ్యాన సభలకు పత్రీజీ మహిళా ధ్యాన యాగంగా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. పరిణీత పత్రీ మాట్లాడుతూ సుభాశ్‌పత్రీజీ ముందుచూపుతో ఆత్మ గ్రంథాలను అధ్యయనం చేసి, జ్ఞానాన్ని ధ్యానులకు అందించారని తెలిపారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో పత్రీజీ శక్తిస్థల్ నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా పాల్వంచ గ్రామానికి చెందిన జయశ్రీ రూ.లక్ష విరాళం అందజేశారు. ధ్యాన వేదికపై నిర్వహిస్తున్న గాయకుల గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సభ్యులు హన్మంతురాజు, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, రాఘవరావు, దామోదర్‌రెడ్డి, శివప్ప, కిషన్‌రెడ్డి, మహేశ్వరి, మాధవి, లక్ష్మీ, నవకాంత్, తాసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

గీతాలుఆ లపిస్తున్న ప్రముఖ గాయకురాలు దామినీ బృందం, ధ్యాన సభలో కళాకారులనా ట్యప్రదర్శన

రమణీయం.. కల్పవృక్ష వాహన సేవ

- ముగిసిన పడమటి అంజన్న ఉత్సవాలు

మక్తల్ టౌన్, డిసెంబర్ 30 : వారం రోజులపాటు అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల మధ్య నిర్వహించిన పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్పవృక్ష వాహన సేవ రమణీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీమాచారీ, కార్యనిర్వహణాధికారి శ్యాంసుందరాచారీ మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మనరాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారన్నారు. అన్ని విధాలా సహకరించిన వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.